సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



రెండో రోజు హోరాహోరీ
విశాఖ: ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలు నగరంలోని ఐదు క్రీడాంశాల్లో హోరాహోరీగా జరుగుతున్నాయి. 8లో



నేత్రపర్వం.. నిత్య కల్యాణం
సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి నిత్యకల్యాణం శనివారం నేత్ర పర్వంగా సాగింది.



ఘనంగా మాఘ మాసోత్సవాలు
విశాఖ: అల్లిపురంలోని సూర్యనారాయణ మూర్తి ఆలయంలో శనివారం మాఘ మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి.

న్యూస్‌రీల్

ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్‌గా అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్‌గా గుడివాడ అమర్‌నాథ్‌ను నియమించారు. ఈ మేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ పనిచేస్తారు.

అడవి దున్న హల్ చల్



వాహనచోదకులకు కనిపించిన అడవి దున్న

రాజవొమ్మంగి: మండలంలోని బట్టావారివీధి గ్రామ సమీపంలో శనివారం ఓ అడవి దున్న హల్‌చల్ చేసింది. వాతంగి నుంచి లోదొడ్డి వెళ్లే మార్గంలో ఆ వన్యప్రాణి రహదారి సమీపంలో కనిపించింది. దీంతో వాహనచోదకులు బెంబేలెత్తిపోయారు. హారన్ మోగిస్తు పెద్దగా శబ్దం చేయడంతో అక్కడి నుంచి అడవిలోకి వెళ్లి పోయినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

సమ్మక్క సారక్కను దర్శించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్



కుటుంబ సమేతంగా దర్శించుకున్న సుభద్ర

ముంచంగిపుట్టు: ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర కుటుంబ సమేతంగా శనివారం తెలంగాణలోని మేడారం సమ్మక్క సారక్క ఆలయాన్ని దర్శించుకున్నారు. జగన్ మళ్లీ సీఎం కావాలని భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసినట్టు ఆమె పేర్కొన్నారు.

రూట్ క్లియర్

పోలవరం ముంపు గ్రామాల ప్రజల సమస్యలపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం గోదావరి వరద సమయంలో రవాణా సమస్య ఎదుర్కొంటున్న ప్రాంతాలను గుర్తించింది. వీటిలో మొదటి ప్రాధాన్యతగా కోతులగుట్ట– ఏడుగురాళ్లపల్లి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.6.98 కోట్లు కేటాయించడంతో 56 గ్రామాల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

- కోతులగుట్ట – ఏడుగురాళ్లపల్లి రోడ్డుకు మోక్షం
- 11.5 కిలోమీటర్ల బీటీ రోడ్డుకు రూ.6.98 కోట్ల మంజూరు
- అత్యవసర నిర్మాణంగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం
- తీరనున్న గోదావరి వరద బాధితుల కష్టాలు
- 56 గ్రామాలకు ఊరట



బీటీ రోడ్డుగా అభివృద్ధి చెందనున్న కోతులగుట్ట- ఏడుగురాళ్లపల్లి రహదారి



కోతులగుట్టలో పునరావాస కేంద్రం (ఫైల్)

కూనవరం: మండల పరిధిలోని కోతులగుట్ట నుంచి బోదునూరు, తాటిలంక మీదుగా ఏడుగురాళ్లపల్లి వరకు బీటీ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గతేడాది గోదావరి వరదల సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ 11.5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.6.98 కోట్లు మంజూరు చేశారు.ఈ పనులు పూర్తయితే వరద సమయంలో సుమారు 56 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పనున్నాయి.

వరదొస్తే..

వర్షాకాలంలో గోదావరి వరద సమయంలో కూనవరం నుంచి భద్రాచలం వెళ్లే ప్రధాన రోడ్డు ముంపునకు గురవుతుంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు పూర్తిగా స్తంభిస్తాయి. వరదలు తగ్గుముఖం పట్టినప్పటికీ పోలిపాక వద్ద రోడ్డు కొట్టుకుపోయి పెద్దపెద్ద గోతులు ఏర్పడటం వల్ల నాలుగైదు రోజుల వరకు వాహనాలు నడిచే అవకాశం ఉండదు. ఈ పరిస్థితుల్లో దాదాపుగా వర్షాకాలంలో మండలంలోని ప్రజలంతా కోతులగుట్ట నుంచి బోదునూరు, తాటిలంక మీదుగా ఏడుగురాళ్లపల్లి వరకు వెళ్లే మార్గంపై ఆధారపడుతుంటారు. ప్రస్తుతం ఈమార్గంలో 11 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి కలెక్టర్ నిధులు మంజూరు చేశారు.

తెలంగాణ వెళ్లేందుకు..

వరద సమయంలో రోగులను తెలంగాణలోని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి ఈ మార్గంలోనే తరలిస్తుంటారు. కోతులగుట్ట, పైదిగూడెం, బోదునూరు, పాలగూడెం, మెట్టరామవరం, టేకులొద్ది, సీతారాంపురం, అభిచర్ల, కూటూరు, రేపాక కాలని, గండికొత్తగూడెం తదితర గ్రామాల్లోని గిరిజనులకు, ఎత్తయిన కొండలపై నివసిస్తున్న 11 గ్రామాల్లోని కొండరెడ్లకు ఈ మార్గమే ఆధారం.

పునరావాస కేంద్రాలక..

వరద సమయంలో కోతులగుట్ట పునరావాస కేంద్రంలో తలదాచుకున్న వరద బాధితులకు అత్యవసర సేవలు అందించేందుకు కూడా ఈమార్గమే కీలకం. కూనవరం, టేకులబోరు, జగ్గవరం, భీమవరం ప్రాంతాల వరద బాధితులు కోతులగుట్టలోని పునరావాస కేంద్రాన్ని ఆశ్రయిస్తుంటారు. వరదనీరు రహదారులన్నింటిని ముంచినా కోతులగుట్ట, ఏడుగురాళ్లపల్లి రహదారి మాత్రం ముంపునకు గురి కాదు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తయితే కూనవరం నుంచి భద్రాచలం ప్రధానరోడ్డు ముంపులోనే ఉంటుంది. ఈ పరిస్థితుల్లో కోతులగుట్ట, పైదిగూడెం, బోదునూరు, పాలగూడెం, మెట్టరామవరం, టేకులొద్ది, సీతారాంపురం, అభిచర్ల, కూటూరు, పెదార్కూరు, రేపాక కాలని, గండికొత్తగూడెం గ్రామాలకు కూడా ఈ రోడ్డే ఆధారం.

ఎంతో ఉపయుక్తం



పోలవరం ముంపులో లేని గ్రామాలకు, పునరావాస కాలనీలకు కూడా ఈరహదారి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. కోతులగుట్ట నుంచి ఏడూగురాళ్ళ పల్లి వద్ద జాతీయ రహదారికి దీన్ని అనుసంధానం చేసి, బీటీ రోడ్డు నిర్మిస్తే భావితరాలకు ఇది ప్రధాన రహదారి అవుతుంది. వీఆర్‌పురం మండలం జీడిగుప్పకు పోలవరం నిర్వాసిత 250 గిరిజన కుటుంబాలకు ఈరహదారి పక్కనే ఉన్న భైరవపట్నం వద్ద పునరావాసం కల్పించారు. వీరికి కూడా ఎంతో ఉపయోగకరం. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– పాయం రంగమ్మ, ఎంపీపీ, కూనవరం

రెండు దశాబ్దాల కల సాకారం



రెండు దశాబ్దాల నాటి కోతులగుట్ట నుంచి బోదునూరు, తాటిలంక మీదుగా ఏడుగురాళ్లపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణం కల ఇన్నాళ్లకు సాకారం అవుతోంది. కాకినాడ జెడ్పీ సమావేశాల్లో అనేకసార్లు ఈ రోడ్డు విషయం ప్రస్తావించా. జెడ్పీ చైర్మన్‌కు, అప్పటి జిల్లా కలెక్టరుకు వినతి పత్రం ఇచ్చా. చింతూరు ఐటీడీఏ గ్రీవెన్స్‌లో సైతం మూడు సార్లు దరఖాస్తు అందజేశాం. ఏడాది క్రితం శబరి కొత్తగూడెంలో ఆర్‌అండ్ ఆర్ గ్రామ సభల పర్యవేక్షణకు విచ్చేసిన కలెక్టర్ సుమిత్ కుమార్‌కు సైతం వినతిపత్రం అందజేశాం.

– గుజ్జా విజయ, జెడ్పీటీసీ, కూనవరం

నిధులు మంజూరు



కోతులగుట్ట నుంచి ఏడుగురాళ్ల పల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వరదల సమయంలో అత్యవసర రహదారులను గుర్తించిన ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టింది. వీటిలో దీనిని మొదటి ప్రాధాన్య రోడ్డుగా గుర్తించింది. దీనిలో భాగంగానే ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి ప్రభుత్వం నిధులు కేటాయించింది. పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– కావూరి చైతన్య, చింతూరు ఐటీడీఏ పీవో/ సబ్ కలెక్టర్

అరకు టీడీపీలో అయోమయం

- గ్రూపులుగా విడిపోయిన పార్టీ శ్రేణులు
- అధిష్టానం అన్యాయం చేసిందని తిరుగుబాటు నేత సివేరి అబ్రహం ప్రచారం
- రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటన



అనంతగిరి: అరకు నియోజకవర్గ టీడీపీలో వర్గ విభేదాల కారణంగా ఆ పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. ఓ వైపు దివంగత మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ కుమారుడైన ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు సివేరి అబ్రహం.. మరోవైపు ప్రస్తుత టీడీపీ అరకు అసెంబ్లీ ఇన్‌చార్జి సివేరి దొన్నుదొర మధ్య రాజకీయం రసవత్తరంగా మారింది. వీరిద్దరు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తిరుగుబాటు అభ్యర్థిగా పోటీ చేస్తానని సివేరి అబ్రహం ఇప్పటికే ప్రకటించారు. మరోపక్క నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి అన్ని వర్గాల మద్దతు కోరుతున్నారు. ఈ పరిస్థితుల్లో పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలా.. సొంత నిర్ణయం తీసుకోవాలో తెలియక టీడీపీ శ్రేణులు తలలు పట్టుకుంటున్నాయి.

చంద్రబాబు నమ్మక ద్రోహం చేశారంటూ..

అరకు సీటు కేటాయించే విషయంలో తనకు అన్యాయం చేయడమే కాకుండా చంద్రబాబు నమ్మక ద్రోహానికి పాల్పడ్డారంటూ పార్టీ శ్రేణులకు వివరిస్తూ తిరుగుబాటు నేత సివేరి అబ్రహం ప్రచారం చేస్తున్నారు. మరోపక్క పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ మద్దతు కూడగడుతున్నారు. టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తానని ఇప్పటికే ఆయన బహిరంగంగా ప్రకటించడం ఆ పార్టీ అధిష్టానానికి మింగుడు పడటం లేదు. సివేరి దొన్నుదొరను టీడీపీ అసెంబ్లీ ఇన్‌చార్జిగా ఆపార్టీ అధిష్టానం ప్రకటించడాన్ని ఇప్పటికే అబ్రహం వర్గీయులు బహిరంగంగా వ్యతిరేకించారు. టికెట్ కేటాయింపు విషయంలో పార్టీ నిర్ణయాన్ని వారు తప్పుపట్టారు.

వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా..

అరకు నియోజకవర్గానికి 2014, 2019లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. కిడారి సర్వేశ్వరరావు 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి, టీడీపీలో చేరారు. 2019లో వైఎస్సార్‌సీపీ తరఫున చెట్టి పాల్గుణ ఎమ్మెల్యేగా గెలుపొందారు. మరోవైపు అదే ఊపుతో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ఆ పార్టీ శ్రేణులు దూసుకుపోతున్నాయి. టీడీపీ శ్రేణులు మాత్రం వర్గ విభేదాలతో కొట్టుమిట్టాడుతున్నాయి.

పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు



రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన జనం



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి

దేవీపట్నం: పేదల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమ ని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అన్నారు. శనివారం వారు మండలంలోని ఫజుల్లాబాద్ నుంచి ఇదుకూరు, పోతవరం, దేవారం, శరభవరం, ఇందుకూరుపేట వరకు రోడ్ షో నిర్వహించారు. వారికి ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పరిపాలన సాగించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఎంతమంది సీఎంలు మారినా పేద ప్రజలు కష్టాలు తెలుసుకుని సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో సంక్షేమ పథకాలు పొందాలంటే ఎవరైనా చనిపోతే తప్ప మరొకరికి పింఛన్ అందని పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అర్హత ఉంటే సరిపోతుందన్నారు. రాజకీయాలకు అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనలో ఎటువంటి అభివృద్ధి నోచుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో గిరిజనులకు కొండపోడు పట్టాలు, రైతు భరోసా అందించిందన్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి నాడు-నేడు ద్వారా పాఠశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సిరసం సత్యవేణి, కందుల బాబ్జి, కట్టా సత్యనారాయణ, సిరసం పెద్దబ్బు, గారపాటి మురళీ, గొర్రెల గోపి, చిన్ని , పెద్ద సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం దృష్టికి 'బొర్రా' సమస్యలు

అనంతగిరి: బొర్రా పంచాయతీకి సంబంధించిన సమస్యలను డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర దృష్టికి తీసుకువెళ్లినట్టు ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు తెలిపారు. శనివారం విజయనగరం జెడ్పీ అతిథి గృహంలో ఆయనను కలిసినట్టు చెప్పారు. పర్యాటకశాఖ నుంచి బొర్రా పంచాయతీకి రావాల్సిన వాటా, ఆ శాఖలో పనిచేస్తున్న గైడ్స్, కార్మికులు వేతనాలు, ప్రైవేటు సంస్థలకు అప్పగించిన ప్రాజెక్టులు, బొర్రాగుహలపై రెండో రైల్వేలైన్ నిర్మాణం తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లామని ఆయన పేర్కొన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

గిరి మహిళలకు ఉపాధి కల్పన

- ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు
- రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి
- ప్రేరణ కార్యక్రమానికి విశేష స్పందన
- 412 మంది ఉద్యోగాలకు ఎంపిక



గిరిజన యువతులతో మాట్లాడుతున్న ఏఎస్పీ జగదీష్ అడహళ్లి

రంపచోడవరం: ఏజెన్సీలో నిరుద్యోగ గిరి మహిళలకు కమ్యూనిటీ పోలీసింగ్‌లో ఉపాధి కల్పనకు పోలీసుశాఖ కృషి చేస్తున్నట్టు రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం ప్రేరణ కార్యక్రమం ద్వారా టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థలో టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాల నియమకాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన నిరుద్యోగ యువత ఉన్నత విద్య అభ్యసించినప్పటికీ సరైన మార్గనిర్దేశకం, నైపుణ్యం లేక గ్రామాలకు పరిమితం అవడాన్ని ఎస్పీ తుహిన్ సిన్హా గుర్తించారన్నారు. వీరందరికి స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రేరణ కార్యక్రమం ద్వారా చేపట్టారన్నారు. వివిధ రకాల కోర్సులను ఉచితంగా ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. రంపచోడవరంలో ప్రశాంతి ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో నిర్వహించిన 'ప్రేరణ' కార్యక్రమానికి రంపచోడవరం,దేవీపట్నం, అడ్డతీగల, గంగవరం, వై.రామవరం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి మండలాలకు చెందిన సుమారు 450 మంది గిరిజన యువతులు హాజరైయ్యారు. వీరిలో 412 మంది టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీలో టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికై నట్టు ఏఎస్పీ తెలిపారు.వీరంతా తమిళనాడు హొసూర్ టౌన్‌లో ఉన్న టాటా ఐ ఫోన్ తయారీ కంపెనీకు ఉద్యోగాల నిమిత్తం పంపిస్తామన్నారు. అన్ని అలవెన్సులతో కలిపి నెలకు రూ.18వేల జీతం పొందుతారని తెలిపారు. వీరికి టాటా కంపెనీలల్లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగస్తుల మాదిరిగా పీఎఫ్, మెడికల్ సదుపాయం ఉంటుందన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా నిర్వహించే కార్యక్రమాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 12వ తేదీన ఎటపాకలో ప్రేరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వాసా వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 70 మంది ఎంపిక

రాజవొమ్మంగి: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రంపచోడవరంలో శనివారం నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో రాజవొమ్మంగి మండలానికి చెందిన 70 మంది ఎంపికై నట్లు సీఐ సన్యాసినాయుడు తెలిపారు. మండలంలో జడ్డంగి, రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇంటర్ చదువుకున్న 80 మహిళా అభ్యర్థులు టాటా ఎలక్ట్రానిక్స్ (తమిళనాడు) నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరయ్యారన్నారు. వీరిలో ఎంపికై న 70 మందికి ఆదివారం నియామకపత్రాలు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

బీసీల పక్షపాతి సీఎం జగన్

అతిరాస కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఇల్లా భాస్కర్‌రావు



అతిరాస రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ ఇల్లా భాస్కర్‌రావును సన్మానించిన నాయకులు

కూనవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీల పక్షపాతి అని, గత ప్రభుత్వం బీసీలను విస్మరిస్తే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే పెద్దపీట వేశారని అతిరాస కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఇల్లా భాస్కర్‌రావు అన్నారు. శనివారం మండలానికి వచ్చిన ఆయనను మేరుకులం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దీకొండ గంగాధర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అతిరాస కార్పొరేషన్‌లోని 18 కులాల వారికి సుమారు రూ. 72 వేల కోట్లు వివిధ పథకాల ద్వారా అందజేశారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నవరత్న పథకాల ద్వారా అన్ని వర్గాల పేదప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలో అందడం లేదన్నారు. పేదల అభివృద్ధిని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. ప్రజలు ఈసారికూడా ఆ కూటమికి తగిన బుద్ధి చెబుతారని జోస్యం చెప్పారు. దీకొండ యతిరాజారావు, దీకొండ వెంకటరమణ, తాల్లూరి లక్ష్మణరావు, తాల్లూరి ప్రసాద్, మేడిది నాగేంద్ర, మేదిది శివరామ్, నోముల శ్రీనివాస్‌రావు, మేడిది సతీష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ దేవస్థానం ఈవోగా నగేష్‌బాబు

మహారాణిపేట (విశాఖ): నగరంలోని ఇసుక కొండ శ్రీ సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఈవో బి.నగేష్‌బాబును సహాయ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయనను తూర్పుగోదావరి జిల్లా మావుళ్లమ్మ దేవస్థానం ఈవోగా నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు

- ఆ సంస్థ ఉమ్మడి విశాఖ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ
- కొయ్యూరులో నూతన భవనం ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన చైర్మన్ రాజీవ్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు

కొయ్యూరు: గ్రంథాలయ అభివృద్ధికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ వెల్లడించారు. మండల కేంద్రంలో రూ.20 లక్షలతో నిర్మించిన శాఖా గ్రంథాలయ భవనాన్ని శనివారం ఆయన పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 ఖాళీ పోస్టులను అవుట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేస్తామన్నారు. విశాఖలో తమ సంస్థకు చెందిన రూ.100 కోట్ల విలువైన భూమిలో రాష్ట్రస్థాయి గ్రంథాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఇందుకు రూ.2 కోట్లు మంజూరయ్యాయన్నారు. బక్ డిపోలు నిర్వహించే వారికి టీడీపీ హయాంలో రూ.ఐదు వందలు ఇస్తే ఇప్పుడు వారికి రూ.3 వేలు చెల్లిస్తున్నామన్నారు. పాఠకులకు అవసరమైన పుస్తకాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయన్నారు. రూ.1.10 కోట్లతో క్రొత్త పుస్తకాలు కొన్నామన్నారు. జిల్లాలో కొయ్యూరుతోపాటు పెదబయలు, జి.మాడుగులలో నూతన భవనాలను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. కొయ్యూరులో గ్రంథాలయ భవనం ప్రహరీ, ఇతర సౌకర్యాలకు నిధులు కేటాయిస్తామన్నారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మ మాట్లాడుతూ రూ.5 లక్షలతో అవసరమైన పనులు చేపడతామన్నారు. అనంతరం చైర్మన్ రాజీవ్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ బడుగు రమేష్, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలమ్మ, అప్పనవెంకటరమణ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, ట్రైకార్ డైరెక్టర్ ఎస్.సరస్వతి, సచివాలయ కన్వీనర్ బండి సుధాకర్, జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ, సర్పంచ్‌లు జంపా కన్నయమ్మ, కె. చింతల్లి, రాజుబాబు సోమన్నదొర, కె.వనంబాబు, నేతలు పాటి శేఖర్, బుజ్జి, రమణమూర్తి, శేఖర్, దిలీప్ పాల్గొన్నారు



ఎం.మాకవరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, పార్టీ శ్రేణులు

మరోసారి జగన్ సీఎం కావాలని పూజలు

మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని కోరుతూ పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి పార్టీ శ్రేణులతో కలిసి శనివారం ఎం.మాకవరం శ్రీశ్రీనాగలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అగ్ని బాధితులను ఆదుకుంటాం

ఇటీవల కంఠారంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను అన్నివిధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి హామీ ఇచ్చారు.ఆమె కంఠారం అగ్ని బాధితులు దొంకల క్ష్మి, బ్రహ్మజీ, షణ్ముక ఆచారి, పెదగాడి సూర్యాకాంతంను పరామర్శించారు.

క్లుప్తంగా

అల్లిగుడెం-చింతూరు బస్సు సర్వీసు ప్రారంభం


బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఓఎస్‌డీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ రాహుల్‌మీనా

చింతూరు: మండలంలోని అల్లిగుడెం నుంచి చింతూరు ఆర్టీసీ బస్సు సర్వీసును ఓఎస్‌డీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ రాహుల్ మీనా శనివారం గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర హయాంలో భద్రాచలం నుంచి ఈ ప్రాంతానికి బస్ సర్వీసులు ఉండగా మావోయిస్టుల ప్రాభల్యం నేపథ్యంలో రద్దు చేశారు. దీంతో పేగ, సూరకుంట, వినాయకపురం, అల్లిగుడెం, నర్సింగపేట, మల్లంపేట గ్రామాలకు చెందిన ప్రజలు రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో ఇటీవల గ్రామంలో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటుకు వచ్చిన అధికారులకు స్థానికులు బస్సు సర్వీసు సమస్యను విన్నవించారు. దీనిపై స్పందించిన జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయించారు. అల్లిగుడెం నుంచి చింతూరుకు ప్రారంభించిన బస్సు సర్వీస్‌లో ప్రజలు ఉచితంగానే ప్రయాణించవచ్చని ఓఎస్‌డీ మహేశ్వరరెడ్డి తెలిపారు. రోజూ రెండు ట్రిప్పులుగా బస్సు సర్వీసు ఉంటుందని, స్థానికులు సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రవాణా సమస్య తీరినందుకు గ్రామస్తులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. సీఐ గంజేంద్రకుమార్, ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు, సర్పంచ్ పాయం చంద్రయ్య, ఉప సర్పంచ్ భూక్యా బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు హోరాహోరీ

- ఉత్కంఠభరితంగా ఆడుదాం ఆంధ్రా
- ఎనిమిది వేదికల్లో ఐదు క్రీడాంశాల్లో పోటీలు
- సత్తా చాటుతున్న క్రీడాకారులు


వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు


కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

విశాఖ స్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. నగరంలోని ఎనిమిది వేదికల్లో.. ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. మెన్ వాలీబాల్ పోటీల్లో భాగంగా శనివారం జరిగిన పోరులో అనకాపల్లి జట్టు 2-1తేడాతో అనంతపురం జట్టుపై విజయం సాధించి తదుపరి రౌండ్‌కు చేరుకుంది. మెన్ ఖోఖోలో విశాఖపట్నం జట్టు 17-14 తేడాతో ఎన్టీఆర్ జట్టుపై విజయం సాధించింది. వుమెన్ బ్యాడ్మింటన్‌లో విశాఖ జట్టు 2-0 సెట్స్‌తో కోనసీమ జట్టుపై విజయం సాధించింది. వైఎస్సార్ స్టేడియం బీ గ్రౌండ్‌లో జరిగిన వుమెన్ క్రికెట్ పోటీల్లో అనంతపురం, విజయనగరం, ప్రకాశం, ఎన్టీఆర్, తిరుపతి జిల్లాలకు చెందిన జట్లు విజయం సాధించాయి. స్టీల్ ప్లాంట్, ఏఎంసీ, కొమ్మాది కేవీకే స్టేడియంలో మెన్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అన్నమయ్య జిల్లా, పల్నాడు, వైఎస్సార్ కడప, తిరుపతి, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం జట్టు విజయం సాధించాయి. మెన్, వుమెన్‌కు ఏయూ గ్రౌండ్స్‌లో కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తుండగా.. వుమెన్ వాలీబాల్‌లో కాకినాడ, బాపట్ల, కృష్ణా, గుంటూరు, అనకాపల్లి జిల్లా జట్లు గెలుపొందాయి. మెన్‌లో ప్రకాశం, నెల్లూరు, పార్వతీపురం మన్యం జట్లు విజయం సాధించాయి.


భోజనాలు చేస్తున్న క్రీడాకారులు

విజేతలు వీరే..

విశాఖ స్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్రా ఫైనల్స్‌లో భాగంగా రెండో రోజు జరిగిన పోటీల్లో విజేతలు వీరే..

బ్యాడ్మింటన్: ఎంవీపీకాలనీలోని జీవీఎంసీ ఎస్-3 ఎన్‌క్లేవ్‌లో జరిగిన వుమెన్ పోటీల్లో పెద వాల్తేర్ 2, స్వర్ణా 2, ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయిస్ కాలనీ, ఎస్.కోట 4, రమణయ్యపేట 2, యముజాలవారి వీధి, శంకరాపురం 4, దైదా, వేటమామిడి జట్లు విజయం సాధించాయి. మెన్‌లో శేఖర్ వీధి, కాగితాల పెంట, నెహ్రూ చౌక్, బేరిపేట, చోడవరం 3, మేట్ల కాలనీ సచివాలయం జట్లు గెలుపొందాయి.

క్రికెట్: ఏఎంసీలో జరిగిన మెన్ క్రికెట్ పోటీల్లో అలమండ 1, కవిటి 1, అనపర్తి 4 జట్లు విజయం సాధించగా స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన పోటీల్లో మధురానగర్ 15, గుర్రంకొండ 2, మల్లమ్మ సెంటర్, లైట్‌పల్లెం సెంటర్ సచివాలయం జట్లు గెలుపొందాయి. వైఎస్సార్ స్టేడియం బీ మైదానంలో జరిగిన మహిళల క్రికెట్‌లో వెంకటాపురం, షికారుగంజి, చిరికూరపాడు, సిద్ధార్థనగర్ సెక్రటేరియట్ జట్లు విజయం సాధించాయి. కొమ్మాది కేవీకే స్టేడియం మైదానంలో జరిగిన మెన్ పోటీల్లో ఎంఆర్ పల్లి 2, గోరిజవోలు, కురుడు సెక్రటేరియట్ జట్లు గెలుపొందాయి.

వాలీబాల్: ఏయూ సిల్వర్ జూబ్లీగ్రౌండ్స్‌లో వాలీబాల్ పోటీలు జరుగుతుండగా వుమెన్‌లో మామిడాలపాడు1, గుంతపల్లి, గౌరీశంకరాపురం, మున్సిఫ్ జంక్షన్, నిజామపట్నం 3, మెన్‌లో గంగపట్నం 1, 189 కొత్తపల్లే, బేతపూడి, గంగపట్నం1, గామల్లపాలెం, చినపచ్చిల సెక్రటేరియట్ జట్లు విజయం సాధించాయి.

కబడ్డీ: ఏయూ గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్స్‌లో కబడ్డీ, ఖోఖో పోటీలు జరుగుతున్నాయి. కబడ్డీ వుమెన్‌లో కారేడు 3, శంకడ, రామారావు కాలనీ, ఆమకతడు, పేరూరు1, నల్లచెరువుపల్లి, లాసన్స్‌బే కాలనీ సెక్రటేరియట్ జట్లు, కబడ్డీ మెన్‌లో గోలెగండ్ల 3, కొత్తపాలెం 2, చింతలపూడి 1, సింగుపురం 1, రాజాం సెక్రటేరియట్ జట్లు విజయం సాధించాయి.

ఖోఖో: మహిళా పోటీల్లో చిదుమూరు, కొండాయపాలెం, కుప్పిలి 1, సత్యనారాయణ కాలనీ, ఖాజీపాలెం, సంజయ్‌గాంధీనగర్, నాగులాపురం సెక్రటేరియట్ జట్లు, మెన్‌లో ముతుకూరు1, నిడమర్రు 2, నిడుగుర్తి, పెద్దారుకురు, పంగలూరు1, లంకెలపాలెం సెక్రటేరియట్ జట్లు గెలుపొందాయి.

వైఎస్సార్ స్టేడియం పరిశీలన

విశాఖ స్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్రా ముగింపు కార్యక్రమానికి ఈ నెల 13న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేస్తున్న సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. నగరంలో ప్రధాన కూడళ్లతో పాటు రోడ్లు, సెంట్రల్ మీడియన్‌లలో వ్యర్థాలు లేకుండా పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వైఎస్సార్ స్టేడియంలో వేదిక ఏర్పాటు పనులను పరిశీలించారు. వీక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్టేడియంలో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఆయన వెంట జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ పి.రవికృష్ణరాజు, సీపీ సురేష్‌కుమార్, జోనల్ కమిషనర్ డి.లక్ష్మి, యూసీడీ పీవో కె.కనకమహాలక్ష్మి, ఈఈ శాంతిరాజ్, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కారు దగ్ధం


తాజంగి-వంజరి రోడ్డులో దగ్ధమవుతున్న కారు

జి.మాడుగుల: మండలంలోని వంజరి 516ఈ జాతీయ రహదారి వంజరి ఘాట్ రోడ్డు వద్ద షార్ట్ సర్క్యూట్ వలన ఓ కారు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. తాజంగి-వంజరి జాతీయ రహదారిలో శనివారం సాయంత్రం తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలకు చెందిన వెంకటరమణకు చెందిన కారు(టీఎస్ 15 ఈఎస్ 3802) లో ఐదుగురు పర్యాటకులు లంబసింగి ప్రాంతానికి వచ్చి పాడేరు, అరకులోయకు బయలుదేరారు. మార్గమధ్యలో వంజరి ఘాట్‌రోడ్డులో కారులో పొగలు, వెను వెంటనే మంటలు రావడంతో గమనించిన ప్రయాణికులు దిగి పారిపోయారు. మంటలు పెరగడంతో కారుదగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ వలనే దగ్ధమయినట్టు పలువురు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీనివాస్ సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దగ్ధమై ఉన్న కారును పక్కకు నిలిపివేయించారు. కారులో ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

బోడిదొరకు మెరుగైన వైద్యం అందించాలి


చికిత్స పొందుతున్న బోడిదొరను పరామర్శిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

మహారాణిపేట: స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత మల్లుదొర మనవడు బోడిదొరను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు శనివారం కేజీహెచ్‌లో పరామర్శించారు. అనారోగ్యానికి గురైన బోడిదొర కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. బోడిదొరకు మెరుగైన వైద్యం అందించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్‌ను శంకరరావు ఆదేశించారు. బోడిదొరకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కేజీహెచ్ సూపరింటెండెంట్‌ను డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఆర్ఎంవోలు డాక్టర్ లక్ష్మీతులసీ, డాక్టర్ జగదీష్, సహాయ గిరిజన సంక్షేమ అధికారి సుబ్రహ్మణ్యం, ఎస్టీ సెల్ వైద్యులున్నారు.

పోటెత్తిన పర్యాటకులు


చాపరాయిలో సందడి చేస్తున్న పర్యాటకులు

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాప రాయి జలపాతం వద్ద శనివారం మైదాన ప్రాంతం నుంచి పర్యాటకులు తరలిరావడంతో చాపరాయి జలపాతం వద్ద సందడి నెలకుంది. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు.

ఆదివాసీ చట్టాలు, హక్కుల పరిరక్షణకు కృషి

ఐటీడీఏ పీవో కావూరి చైతన్య


కొమ్ముకోయ నృత్యం చేస్తున్న కళాకారులు


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చైతన్య

చింతూరు: ఏజన్సీలో ఆదివాసీ చట్టాలు, హక్కుల పరిరక్షణకు ఐటీడీఏ కృషి చేస్తోందని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. ఐదవ ఆదివాసీ సాంస్కృతిక సమ్మేళనంలో భాగంగా చింతూరులో జరుగుతున్న రేల పండుగ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో ఆకట్టుకునేలా ఉన్నాయని, వాటిని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. ప్రకృతితో మమేకమై జీవిస్తున్న ఆదివాసీల జీవనవిధానం భావితరాలకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. గిరిజనుల అభ్యున్నతికి ఐటీడీఏ ద్వారా తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. వేడుకలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి సున్నం వెంకటరమణ, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూసం శ్రీను, టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కణితి రామకృష్ణ, ప్రచార కార్యదర్శి సోడె మురళి, తిమ్మ వెంకటసాయి, సోడె నారాయణ, సావిత్రితో పాటు ఆదివాసీ పూజారులు, పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్ స్టేడియం పరిశీలన

విశాఖ స్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్రా ముగింపు కార్యక్రమానికి ఈ నెల 13న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేస్తున్న సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ స్టేడియంలో వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. వీక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పటిష్టమైన ఏర్పా ట్లు చేపట్టాలన్నారు. జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ పి.రవికృష్ణరాజు, సీపీ సురేష్‌కుమార్, జెడ్సీ లక్ష్మి, యూసీడీ పీవో కనకమహాలక్ష్మి, ఈఈ శాంతిరాజ్ తదితరులున్నారు.

జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ సలహాదారుగా శ్రీనివాస్


ఏయూ వైస్ ఛాన్సలర్ పీవీజీడీ ప్రసాదరెడ్డితో శ్రీనివాస్

రాజవొమ్మంగి: ఏపీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ బీసీ ఎస్టీ ఎస్సీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ సలహాదారుగా రాజవొమ్మంగికి చెందిన ఎస్. శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆంధ్రా యూనివర్సిటీ టీఎల్ఎన్ సభా మందిరంలో జేఏసీ నూతన కార్యవర్గ సమావేశం మేనేజింగ్ డైరెక్టర్ మందారపు వెంకట్రామయ్య అధ్యక్షతన శనివారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఏయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి హాజరయ్యారు.తనను జిల్లా సలహాదారుగా ఎంపిక చేసిన కమిటీకి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.